

# అందాల భరిణి కాంచన రావమ్మా! తెరపై చూచి ఎన్నాళ్ళయిందమ్మా!

తిరుమల కొండయొక్క రెండవ ఘాట్‌రోడ్‌లోని వినాయక ఆలయం వద్ద చూసాను. నిరతమూ వాత్సల్యంగా పలుకరించే హేమాచౌదరి నీ ప్రక్కన ఉన్నది. ఆమె తల్లి బృందావనం చౌదరిలా గౌరవిస్తుంది.

ఆమె పలకరింపుతో నా కళ్లు నిన్ను చూసాయ్. ఎన్నో జన్మలందున్నంత ఆత్మీయ బంధం వోలె నను చుట్టుముట్టింది.

దగ్గరగా వచ్చి మాట్లాడాలనుకున్నాను. నా అంతర్హృదయం సిగ్గుతో చెలమరింది. మరికొంతసేపు అలాగే చూస్తూ ఉండాలనుకున్నాను. నా కారు డ్రైవర్ వేసిన హారన్ నన్ను సైరన్‌లా హూంకరించింది.

ఇప్పుడైనా యేఁవి! అందాల భరిణి అందాల భరిణే! వయసుకు ముదిమితనం రావచ్చు, వర్చస్సుకు ముదిమితనం రాదు.

చింత చింత చిగురు, సంపెంగ గుబురు చిన్నదాని మనసు- అన్నారు సినీ మహాకవి మల్లాది రామకృష్ణశాస్త్రిగారు. ఆయన నిను చూస్తే- మరెన్నో సంపెంగ గుబాళింపు పదాలు గుభాళించేవారో! మూన్‌లైటు వైటు అన్న గురజాడ ఏమనేవారో అలాంటి వైటు లైట్ అనేవారా? పుత్తడి బొమ్మా పూర్ణమ్మా అనేవారా? నేను మాత్రం నీ వైటు, లైటు కుండదంటాను.

మోడరన్ బామ్మగా వస్తున్నావట, మొరటు మనవలు ఉంటారు జాగ్రత్త! నీవు రావడం వెండితెరకే అందం.

ఈ తరం ప్రేక్షకులకు కాంచన అనగానే ఆ పేరుతో వచ్చిన హిట్ సినిమా గుర్తొస్తుంది. నిన్నటి తరం ప్రేక్షకులకు మాత్రం పెద్ద హీరోయిన్ గుర్తొస్తుంది. 1960-70లలో దక్షిణాది ప్రేక్షకుల కలలరాణి, ఎన్టీయార్, ఏయన్నార్, కృష్ణ, కృష్ణంరాజు శోభన్‌బాబు తదితరులతో సినిమాలు చేసిన స్టార్ హీరోయిన్ ఆమె. చాలా ఏళ్ల తర్వాత ఆమె మళ్లీ మేకప్ వేసుకుంది. 'పెళ్ళిచూపులు' ఫేమ్ విజయ్ దేవరకొండ హీరోగా సందీప్ వంగా దర్శకత్వంలో రూపొందుతున్న 'అర్జున్‌రెడ్డి' చిత్రంలో ఆమె నటిస్తున్నారు. కొన్ని రోజులు షూటింగ్‌లో పాల్గొన్నారట. త్వరలో ఆమెపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. దర్శకుడు సందీప్ వంగా మాట్లాడుతూ మూడేళ్ల క్రితం టీవీలో కాంచనగారి ఇంటర్వ్యూ చూశా. ఆమెను దృష్టిలో పెట్టుకుని కథ రాశానని అడిగితే ఆలోచిస్తా అన్నారు. మళ్లీమళ్లీ అడిగాను. నేనూ, విజయ్ చెన్నై వెళ్ళికథ చెప్పిన తర్వాత నేనెందుకు పట్టుబట్టానో ఆమెకు అర్థమైంది. కాంచనగారి పాత్ర ఎలా వుంటుంది? అని అడిగితే మోడ్రన్ బామ్మలా ఉంటుంది. సాధారణంగా మనవలు ఏదైనా తప్పుచేస్తే నానమ్మలు బాధపడటమో, తిట్టడమో చేస్తారు. పాతికేళ్ల కుర్రాడు ఏ పరిస్థితుల్లో చేశాడనేది మా సినిమాలో మాడ్రన్ నానమ్మ అర్థం చేసుకుంటుంది అన్నారు దర్శకుడు. స్వస్తి

**గోటేటి శ్రీరామారావు**



# జాతీయ జెండాతో ఖాదీ బంధం



నూలుని వడికి తయారుచేసే ఖద్దర్‌ని మనదేశంలో కేవలం వస్త్రంగానే చూడరు. స్వాతంత్ర్యోద్యమానికి, ఖద్దర్‌కి మధ్య విడదీయరాని బంధం ఉంది. ఖద్దర్ ఆధారంగా మహాత్మాగాంధీ ఉద్యమానికి ఊపిరిపోశారు. స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిన ఖద్దర్ ఈ 70 ఏళ్ల స్వతంత్ర్య దేశంలో దశలవారీగా పలు మార్పులకు లోనైంది. ఖద్దర్‌ను కేంద్రంగా చేసుకుని ఈ మధ్య పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆ విశేషాలే ఇవి.

ముువ్వన్నెల ఖద్దరు ముచ్చటతో ముద్దులొలికే జాతీయ జెండా రూపక శిల్పి వెంకయ్య మన తెలుగువాడే.

కేంద్రజౌళి మంత్రిత్వ శాఖ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా జవాన్లకు కృతజ్ఞతలు చెప్పేందుకు వినూత్నమైన ఆలోచన చేసింది. ఖాదీ బోర్డు మీద సందేశాలు రాసి జవాన్లకు పంపమంటోంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దేశావాళి వస్త్ర పరిశ్రమకు ప్రేరణ కలిగిస్తోంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర రాజధానులు కలుపుకుని 70 లొకేషన్లలో ఈ ఏర్పాటు చేశారు. ఖాదీ బోర్డు మీద సందేశాలు రాయడం లేదా అరచేతిని జెండా రంగుల్లో ముంచి ముద్రవేయడం వంటివి చేయాలి. డిఫెన్స్ మినిస్ట్రీ కూడా 'ఆజాది కె రంగ్' పేరిట వీడియో రూపొందించినట్లు తెలుస్తూంది.

## ఖాదీ డే

ఖాదీని చల్లని తల్లి అనొచ్చు. ఎంతో ప్రత్యేకతను కలిగిన ఖాదీని ప్రపంచ వ్యాప్తంగా పాపులర్ చేసే ఆలోచనలో భారత ప్రభుత్వం ఉంది. అందులో భాగంగానే ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ రీతి బెరి త్వరలో 'ఖాదీ డే'ను ప్రకటించాలి అంటున్నారు. ఖాదీకి ఇలా ఒక రోజు కేటాయించడం వల్ల మహాత్మాగాంధీకి నివాళి అర్పించుకో వచ్చు అనేది ఆమె భావన. ఖాధీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్‌లో సలహాదారుగా ఉన్నారు. రితుకి ఫ్యాషన్ పరిశ్రమలో 25 యేళ్ల డిజైనర్ అనుభవం ఉంది. జాతీయ అంతర్జాతీయ సెలబ్రిటీల డిజైనర్ కూడా.

కొంతకాలం క్రితం 'ఐవేర్ హ్యాండ్లూమ్' అనే హ్యాష్‌టాగ్‌తో సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభమైంది. మొత్తంమీద టెక్నాలజీ, పెరిగిన అవగాహన వల్ల ఖద్దర్ ఫ్యాషన్ ప్రపంచంలో తనకో విశిష్ట స్థానాన్ని ఏర్పరచుకుంటుందనే చెప్పాలి.

## స్నాతకోత్సవానికి..

విద్యార్థుల్లో జాతీయ భావం కలిగించేందుకు ఐఐటి ముంబయి స్నాతకోత్సవం కోసం 8500 రోబ్స్‌ను ఆర్డర్ చేసింది. గుజరాత్ విశ్వవిద్యాలయం తరువాత ప్రముఖ ఐఐటి ఇనిస్టిట్యూట్ అధికార వర్గాల హృదయాల్లో ఈ ఆలోచన తలెత్తింది. దాందో మూడువేల ఐదొందల ఉత్తరీయాలు ఆర్డర్ చేసింది ఈ విద్యా సంస్థ. ●


*Compliments from*
**Sri Krishna Bhat**
*When you come to*
*Holy Pilgrimage Centre Tirupati & Tirumala*
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

# వయొలిన్ వాగ్గేయకారుడు హరినాగభూషణం

'వయొలిన్' అంటే వాయులీనం అనగానే మనకు గుర్తుకొచ్చే సంగీతకారుడు ద్వారం వెంకటస్వామినాయుడు. ఆయనకన్నా ముందుగానే జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతులుగాంచిన ప్రముఖ వాగ్గేయకారుడు వయొలిన్ విద్వాంసుడు 'హరినాగభూషణం'గారు. ఆయన కళలకు కాణాచి అయిన బందరు పట్టణంలో జన్మించారు. వయొలిన్ వాద్యంలో అందెవేసిన చేయి.

కృష్ణాజిల్లా మచిలీపట్టణంలో 1884 డిసెంబరు 24న సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. తండ్రి నరసింహశాస్త్రి ఆ రోజుల్లోనే గొప్ప సంగీతకారుడు. పుట్టుకతోనే




సంగీతాభిరుచి కలిగిన నాగభూషణం తన తండ్రి వద్దనే సరిగమలతో సంగీతాభ్యాసం ప్రారంభించి, 13వ ఏటనే మలయమారుతం, ఆనందభైరవి, రీతిగౌళ రాగాలలో తాన వర్ణములను రచించారు. సంగీతంలో సకల పాండిత్యాన్ని అధ్యయనం చేసి, ఫిడేలు వాయించడంలో కళాప్రకాండుడుగా పేరు ప్రఖ్యాతులార్జించారు.

తనకు ఆరో ప్రాణమైన సంగీత కళను దశదిశలా వ్యాపింపచేయాలని 1911లో మచిలీపట్నంలో 'త్యాగరాయ సమాజం' అనే సంగీత సంస్థను నెలకొల్పి ప్రతిఏటా త్యాగరాజ వర్ధంతి ఉత్సవాలను నిర్వహించి, ఎందరో గొప్ప గొప్ప సంగీతకారులను ఆహ్వానించి సంగీత కచేరీలు జరిపించేవారు.

1916లో బరోడా నగరంలో నాటి ఆచంట సంస్థానాధీశుడు నిర్వహించిన సంగీత పరిషత్ సమావేశంలో నాగభూషణంగారు పాల్గొని 22 శ్రుతులను గురించి తన వాదలనను ప్రముఖుల ముందుంచి వారి ఆమోదం పొందారు. ఆ సదస్సులో ఆయన కర్ణాటక గాత్ర కచేరీ చేసి పలువురి ప్రశంసలందుకున్నారు. అప్పుడే 'గాయకరత్న' బిరుదంతో, రాజ సన్మానం, సత్కారాలను అందుకున్నారు.

అటునుండి ఆయన తన సంగీత జైత్రయాత్రను ప్రారంభించి దక్షిణ భారత దేశంలోని మైసూరు, కుంభకోణం, తంజావూరు, తిరువయ్యూరు, మద్రాసు వంటి సంగీత కళాక్షేత్రాలలో సంగీత కచేరీలు చేసి పలు సన్మానాలు పొందారు. ఆ రోజుల్లో సంగీత ప్రపంచంలో ప్రఖ్యాతులైన టైగర్ వరదాచారి, నైనా పిళ్లె, దక్షిణామూర్తి సంజీవరావు వంటి మహా సంగీతకారులు ఆయనను గొప్ప సంగీతకారుడుగా ప్రశంసించారు.


గాయకుడుగా ఒక వైపు వాగ్గేయకారుడుగా మరోవైపు కీర్తిగాంచిన నాగభూషణం గారు రచయితగా కూడా పేరుగాంచారు. 50కి పైగా రాసిన వీరి కృతుల్లో ఒక ప్రత్యేకమైన సంగీతబాణి, సాహిత్యపు వాణి వినిపిస్తాయి. వీరి రచనల్లో పల్లవి, అనుపల్లవి, చిట్టస్వరం, స్వరసాహిత్యం మొదలైనవి గోచరిస్తాయి. త్యాగరాజ చరిత్ర, శంకరాచార్య చరిత్ర, శ్రీరామకృష్ణోపాఖ్యానం అనునవి ఆయన రచనల్లో ముఖ్యమైనవి. ఇంకా అమృత వర్షిణి, మాధవ ప్రియ వంటి ఆదర్శరాగాలతో 2 కృతులను రాశారు. మరో వైపు సంస్కృతంలో కూడా పాండిత్యం గల నాగభూషణంగారు భాషలో కూడా రచనలు చేశారు. ఆంగ్లభాషలో ఆయన పట్టభద్రుడు.

హరినాగభూషణం గారు ఆ రోజుల్లో ఎక్కడ సంగీత కచేరీలు చేసినా ఆ సభలకు జనం విరగబడి వచ్చేవారు. ఆయన సమకాలికుడే అయిన ద్వారం వెంకటస్వామి నాయుడు గారు కూడా గొప్ప వయొలిన్ విద్వాంసుడు. వీరిద్దరూ కలిసి సభ చేసిన సందర్భం ఎప్పుడూ రాలేదు. "ఒకవేళ ద్వారం వారితో కలిసి కచేరీ చేసే సందర్భం వస్తే ఎలా ఉంటుంది" అని ఒక అభిమాని హరినాగభూషణం గారిని ప్రశ్నిస్తే - చిరునవ్వుతో "ఏమవుతుంది- మేమిద్దరం కలిసి సభ చేస్తే 'హరిద్వారం అవుతుంది' అని జవాబిచ్చారు. వారిరువురూ అంతటి గొప్ప కళాకారులే.

నాగభూషణంగారిని 1912లో మద్రాసు ఆయన 28వ ఏటనే 'సువర్ణ ఘంటా కంకణం' తొడిగి ఘనంగా సన్మానించారు. 1929లో ఆయన మైసూరు రాజా వారి ఆస్థానంలో సన్మానితులైనారు. 'వాగ్గేయకార రత్న' బిరుదాంకితులైనాడు. 1944లో ఆ మహానుభావుడు పక్షవాతానికి గురై 1959లో తనువు చాలించారు.

(హెచ్ రమేశ్‌బాబుకు కృతజ్ఞతలు)

## "ఆంధ్ర తెలంగాణా" అన్న నెహ్రూ మాటలు నిజమయ్యాయ్!



ఏ సుమూహూర్తాన 'ఆంధ్ర- తెలంగాణా'యని భాషా రాష్ట్ర విభజన చేసిన రోజున అనుకున్నారో గానీ- 'ఆంధ్ర- తెలంగాణా' అనుకున్న ఏకైక నామ రాష్ట్రం ద్వినామ రాష్ట్రంగా రూపులు దిద్దుకున్నది.

1956 నవంబర్ 1న ఏర్పడిన కొత్త రాష్ట్రానికి 'ఆంధ్ర- తెలంగాణా'గా నామకరణం చేయాలని కొందరు భావించారు. అప్పటి భారత ప్రభుత్వ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పార్లమెంటులో (వికటాట్టహాస) ప్రకటన చేస్తూ 'అమాయకపు అమ్మాయికి గడసరి అబ్బాయితో పెళ్ళి అవుతున్నది. కొన్నాళ్ళన్తరమ్ కాపురం కొనసాగకపోతే విడాకుల్చి విడిపోవచ్చునేమో!' అన్నారట. తథాస్తు దేవతలు ఆ మాటలు విన్నారు కాబోలు. 'అస్తు' అన్నారు.

కొన్నాళ్ళొకటిగా కాపురం చేసిన యిరు రాష్ట్రాలూ శుభమస్తు యని ఎవరి కాపురం వారు పెట్టుకున్నారు. యిందు యిసుమంత వింతలేదు. కసుమంత (కుస్తంత) విడ్డూరమూ లేదు.

ఆ మాటల్ను విన్న ఆనాటి జనం విస్తుపోనూలేదు. విచారపడనూ లేదు. కమ్యూనిస్టులు మాత్రం విశాలాంధ్ర కావాలన్నారు. కానీ విశాలాంధ్ర కిక్కు ఎవరికీ పెద్దగా యెక్కలేదు.

ఫజులాలీ కమిషను వారు తెలంగాణాను ఐదేళ్ళు విడిగా ఉండనివ్వమన్నారు. వారు చెప్పిన నాలుగు నెలలకే నెహ్రూగారు పార్లమెంటులో ఆంధ్ర తెలంగాణాలకు కొంగుముడి వేస్తున్నట్లు ప్రకటించారు. పార్లమెంటు ముసాయిదా బిల్లులో నెహ్రూగారు ఆంధ్ర తెలంగాణా అన్నారు. అటు తరువాత ఆంధ్ర- తెలంగాణా శబ్ద వ్యాచకం సరిగ్గాలేదని 'ఆంధ్రప్రదేశ్' అన్నారు. ఆ పేరుకూడా కొందరికి రుచ్యం కాలేదు. అమాయకపు అమ్మాయికి గడసరి అబ్బాయితో పెళ్ళవుతున్నదన్న మాటల్లోనే, అంతర్లీనంగా విడాకులు పదమున్నది.

కాశ్మీరమునుంచీ కన్యాకుమారి వరకూ ఒకే దేశంగా ఉండాలన్న వల్లభాయ్ పటేల్ ప్రయాస- ఇలా నెహ్రూగారి చేతి చలువా, ఆంధ్రులు ప్రత్యేక రాష్ట్రం కావాలనే పోరుదలతో- దేశంలోని రాష్ట్రాలు ప్రత్యేక భాషా రాష్ట్రాలుగా చీలిపోయాయి.

భాషా రాష్ట్ర విభజనలో ఆంధ్ర భాషా రాష్ట్రం విశిష్టమైన ప్రదేశాలను చాలా కోల్పోయింది. ముఖ్యంగా ఆంధ్రులు పెంచుకున్న చెన్న పట్నం తెలుగువారి రాష్ట్రంలో లేకపోవడం తీర్చుకోలేని దెబ్బ. గూడులేని పక్షుల్లా తెలుగువారు- సదుపాయాల్లేని కర్నూలు వెళ్ళడం, వెళ్ళిన కర్నూలులో వసతుల్ను చేకూర్చుకోలేక పోవడం మొదటి కష్టమైతే, ఆంధ్రప్రదేశ్ రాజధానీ నగరంగా హైదరాబాద్, సికింద్రాబాద్‌ల్లో పాదం మోపే స్థలం లేకుండా పోవడం చూస్తే జరాసంధుని శరీరం ఎడాపెడా చీల్చి రెండు భాగాలుగా చేసినట్టయింది.



# రాముడికి సీత ఏమవుతుంది??

-జ్యోతి వలబోజు

అందరికీ తెలిసిన వాడుక మాట ఇది. ఎవరికైనా విషయమంతా చెప్పిన తర్వాత కూడా ఏదో సందేహం వస్తే రామాయణమంతా విని రాముడికి సీత ఏమవుతుంది అని అడిగినట్టు ఉంది- అని వేళాకోళం చేస్తారు. నిజానికి ఈ ప్రశ్న చాలా అర్థవంతమైనది. అసలు సీతారాములలో ఎవరు గొప్ప అనేకంటే వారి మధ్య ఉన్న బంధం ఎటువంటిది అని తెలుసుకోవడం మంచిది.

రాముడికి సీత ఏమవుతుందో అనుకుంటూ వివరాలు చూద్దాం..

రావణాసురుడిని ఎలా సంహరించాలి అని శ్రీహరి మధనపడుతున్నవేళ ఆ హృదయం మీద నిరంతరం కొలువై ఉన్న లక్ష్మీదేవి (అలా ఎప్పటికి కూర్చుని ఉండడం వల్ల శ్రీవారి హృదయానికి ఓ మచ్చ ఏర్పడింది దాన్నే శ్రీవత్సం అంటారు.) శ్రీహరికి ధైర్యం చెప్తూ, తాను భూలోకాన అవతరిస్తాను అని చెప్పి మరుక్షణంలో వేదవతి రూపంలో భూలోకాన అవతరించింది. దీన్ని బట్టి చూస్తే సీత రాముడికి మార్గదర్శకురాలు అయ్యింది.

దశరథుడు చేసిన పుత్రకామేష్టి అశ్వమేధ యాగాల కారణంగా వచ్చిన పాయసం ద్వారా రాముడు కౌసల్య గర్భాన పదకొండు నెలల తర్వాత యోనిజుడై పుట్టాడు. సీతమ్మ మాత్రం అయోనిజయై జన్మించి జనకుడికి నాగటి చాలులో లభించింది. దీని బట్టి చూస్తే సీత రాముడికంటే అధికస్థాయిలో పుట్టినదౌతుంది.

## అధిక బలశాలిని

తన ఆరవ ఏట ఒకనాడు చెలులతో బంతి ఆట ఆడుతున్న సీత ఎడమచేతితో మహిమాన్వితమైన శివధనుస్సు ఉన్న పెద్ద భోషాణాన్ని అలవోకగా పక్కకు జరిపేస్తుంది. రాముడు తన పదమూడవ ఏట స్వయంవర సభలో అదే వింటిని ధనుర్భంగం చేశాడు. దీన్ని బట్టి రాముడు తన పదమూడవ ఏట చేయగల పనిని ఆరవఏటనే సీతమ్మ చేయగలిగిన బలశాలి అని తెలుస్తోంది.



లోకంలో ఎక్కడైనా పరీక్షించేవాడు గొప్పవాడూ, పరీక్షకి సిద్ధమైన అభ్యర్థి తక్కువవాడూ అవుతాడు. సీతమ్మ రామునికి శివధనుస్సుని పరీక్షగా పెట్టింది. అడిగిన దానికంటే ఎక్కువ సమాధానమిస్తూ (ఎక్కుపెట్టమంటే ఏకంగా విల్లునే విరిచేసాడు) రాముడు ఎక్కువ అంకాలతో ఉత్తీర్ణుడయ్యాడు. అంటే రాముడిని పరీక్షించగల శక్తి సీతమ్మకు ఉంది అని అర్థమవుతుంది.

తల్లి కోరిక మేరకు పట్టాభిషేకాన్ని రద్దు చేసుకుని అరణ్యవాసానికి పయనమైన రాముడు "అరణ్యాల్లో పులులూ , సింహాలూ, కొండ చిలువలూ, కల్లోల వాతావరణముంటుంది కాని ఏ సౌఖ్యాలూ ఉండవు" కావున సీతమ్మను తనతో రావొద్దని అంటాడు. కాని సీత తాను సౌఖ్యాలకోసం కాదు అరణ్యాలను చూడాలని ఉవ్విళ్ళూరుతున్నాను, అందునా భర్త తోడుండగా భయమేల అని రాముడికే ధైర్యం చెప్పి వెంట నడుస్తుంది.

## వయసుకి మించిన విజ్ఞత

సామాజిక దృష్టితో, దూర దృష్టితో రామునికి కూడా ఆశ్చర్యాన్ని కలిగించేటంతటి ఉత్తమురాలు సీతమ్మ. చిన్న వయసులోనే (వనవాసానికి వెళ్లేటప్పుడు సీత వయసు 18 ఏళ్లు) పెద్దరికం తెచ్చుకుంది. రాముడికీ తోడూ నీడా అయింది. అరణ్యమునకు వెడుతూ సీతారాములు అనసూయాదేవిని దర్శించారు. ఇద్దరినీ ఆశీర్వదించిన అనసూయ సీతతో "అమ్మాయి నీ పెళ్లి కథని వివరించు" అని అడిగింది. సీతమ్మ తమని అరణ్యాలకు పంపి కష్టాల పాలు చేసిన కైకను, దశరథుని, రాముడిని. ఎవరినీ నిందించకుండా ఓపికగా పెళ్లి వివరాలు చెప్పింది. దానికి మురిసి పోయిన అనసూయ సీతకు వాడని పుష్పాలు, నలగని వస్త్రాలని ఇచ్చి ఆశీర్వదించింది.

రాముడికంటే ముందు తాను భూలోకానికి వేదవతిగా రావణాసురుడిని చంపించడానికే పుడతానని చెప్పింది. అలాగే రాముడికంటే ముందే లంకా నగారానికి వెళ్లింది. అదే విధంగా తానే ముందు వైకుంఠానికి వెళ్లింది సీతమ్మ. ఎక్కడెక్కడికి సీతమ్మ తనకంటే ముందు వెళ్లిందో (భూలోకానికి, మిథిలకి, లంకా నగారానికి, వాల్మీకి ఆశ్రమానికి, వైకుంఠానికి) రాముడు అక్కడక్కడికీ వెళ్లాడు. రాముని ప్రయాణం విజయవంతం కావాలని తాను ముందుగా వెళ్లి తన నాథుడికి అనుకూల పరిస్థితులను కల్పించిన సీతమ్మ రాముడికే మార్గదర్శకురాలైంది.

అరణ్యవాసంలో ఉన్న తనని రావణుడు ఎక్కడ అపహరించడో అని తల్లడిల్లి పోయింది సీతమ్మ. రావణుడు తనని అపహరించని పక్షంలో రావణుడిని వధంచడానికి రాముడికి తగిన కారణం దొరకని పక్షంలో రామావతార ప్రయోజనమే దెబ్బతింటుందని భావించిన సీత తన ప్రాణాన్ని, వంశప్రతిష్టతని పణంగా పెట్టి భర్తకోసమే రావణుడు తనని అపహరించేలా చేసుకుంది సీతమ్మ తల్లి. సీతాపహరణ సమయంలో రావణుడితో జరిగిన పోరులో రెక్కలు విరిగి, చావు బ్రతుకుల్లో ఉన్న జటాయువును దుఖంతో కౌగలించుకుంటుంది. . భూమినుండి ఉద్భవించినందున సకల ఓషధులకు సమానురాలైన సీతమ్మ స్పర్శ కారణంగానే జటాయువు రాముడు వచ్చేవరకు ప్రాణాలతో ఉండగలిగాడు.

# దయచేసి తెలుగును కాపాడుడు!

**అంటూ భుజానికి బేనర్ తగిలించుకుని, వీధుల వెంట తిరిగి ప్రచారం చేసిన**

## సాధువరదరాజం పంతులు

**ఎవరు ఈసడించినా సిగ్గుపడలేదు. సాధువరదరాజు పంతులు అంటే నిజమైన సాధు వరదరాజులే.**

తమ ప్రాంతాల తెలుగును ఇతరులు ఈసడించినా, తాము తెలుగువాళ్ళమని, తమ భాషను పరిరక్షించుకోవడం తమ కర్తవ్యమని దక్షిణ భారతంలోని ముఖ్యంగా తమిళనాడులో తెలుగువారు ఆరు దశాబ్దాల క్రిందటే భావించారు. సాధు వరదరాజం పంతులుగారి అకుంఠిత దీక్షవల్ల తమిళనాడులో కొడిగట్టుతున్న తెలుగుదీపం స్నేహప్రాప్తిని మళ్లీ జాజ్వలమానంగా వెలుగుతోంది.

వరదరాజం పంతులుగారు తిరునల్వేలి జిల్లాలోని వీర రాఘవపురంలో 1889 ఆగస్టు 20న జన్మించారు. వీరి తండ్రి సాధురమాకృష్ణయ్య పంతులుగారు, వివిధ ప్రభుత్వోద్యోగాలలోనూ, ఎట్టియాపురం సంస్థానంలో దివాన్‌గాను పనిచేశారు. ఎట్టియాపురం తెలుగు రాజులు తెలుగు సంగీత సాహిత్యాలు పోషించినవారు. ఆయన ఆంధ్ర మహాభారతాన్ని తమిళంలో అనువదించారు. ఆంధ్ర మహాభారతాన్ని తమిళభాషలో వచనరూపంగా అనువదింపజేసి ప్రకటించారు. సాధువరదరాజం పంతులు తమిళం బాగా అభ్యసించారు. పట్టభద్రులయిన తర్వాత మద్రాసు విశ్వవిద్యాలయం వారి Lexicon (తమిళ శబ్దకోశం) కార్యాలయంలో ఒక చిన్న గుమస్తాగా చేరి ఆఫీసు మేనేజరుగా చాలా కాలం పనిచేసి రిటైర్ అయ్యారు.

ఆయనకు తెలుగు అంటే వీరాభిమానం. తమిళ నిఘంటువు కార్యాలయంలో పనిచేస్తున్నప్పుడు ఆయన తెలుగు మీద అభిమానం ఏర్పడింది. తెలుగు మాట్లాడడం వచ్చినా, వ్రాయడం, చదవడం రాదు. తెలుగు సాహిత్యంలో పరిచయం లేదు. ఈ లోపాలకు ఆయన సిగ్గుపడి తెలుగు లిపి నేర్చుకున్నాడు. తెలుగు శతకాలు, భాస్కర రామయణం, పోతన భాగవతం, వీరేశలింగం రచనలు, ఆంధ్రపత్రిక దినం దినం చదివారు. తమ యింట్లో వాళ్లకు తెలుగు నేర్పారు. భార్యాపుత్రులూ ఆయన ఉద్యమానికి సహకరించారు. వరదరాజం పంతులుగారి భార్య జయలక్ష్మమ్మ, కుమారుడు శివసుబ్రహ్మణ్యం తెలుగులో ప్రావీణ్యం సంపాదించారు. వరదరాజం పంతులుగారి ఉద్యమానికి తోడ్పడ్డారు. ఆయన తమిళనాడులోని తెలుగువారిలో క్షీణిస్తున్న తెలుగుకు ప్రాణం పోశారు. పనిగట్టుకుని స్వంత ఖర్చులతో ఊరూరు ఎక్కే గుమ్మం, దిగే గుమ్మంగా పర్యటించి తరతరాల తెలుగును ప్రగతిబాటలో నిలిపారు.

తమిళనాడులోని చాలామంది తెలుగువాళ్లకు తెలుగులిపి తెలియదు. భాషా వ్యాప్తికి లిపి అడ్డం రాకూడదు. తంజావూరులో మహారాష్ట్ర రాజులు తెలుగు కావ్యాయలను నాగరలిపిలో వ్రాయించుకొని చదివారు. ఆంగ్లేయులు సంస్కృతాన్ని రోమన్‌లిపిలో ముద్రించుకున్నారు. నేడు కూడా సైన్యంలో హిందూస్తానీకి లిపి రోమన్‌లిపే. సింధులో అరబ్బీ లిపిలో సంస్కృత గ్రంథాలున్నాయి. సాధు వరదరాజం పంతులుగారు తమిళనాడులో తెలుగు ప్రచారానికి తమిళ లిపిలో తెలుగు రచనలను అచ్చు వేయించారు.'దక్షిణాంధ్ర పత్రిక' అనే ఒక పత్రికను పెట్టి ఉచితంగా ప్రతులను పంచారు.

వరదరాజం పంతులుగారి పుణ్యమా అని తమిళనాడులోని తెలుగువారు తమ భాషకు, యాసకు సిగ్గుపడడం మానేశారు. ఆయనకు 'దక్షిణాంధ్ర పితామహ' 'భాషోద్ధారక' అనే బిరుదులు ఇచ్చి గౌరవించారు. వరదరాజం పంతులుగారు 'దయచేసి తెలుగును కాపాడుడు' అనే పెద్ద బ్యానరును భుజానికి తగిలించుకొని కాలికి బలపం కట్టుకుని తమిళ దేశమంతా తిరిగారు. ఆయన ఉద్యమం ఫలించింది. ఈ విధంగా తెలుగువ్యాప్తికి, పరిరక్షణకు జీవితం వెచ్చించి ధన్యులైన వరదరాజం పంతులుగారు 1972లో, 83 ఏట కాలధర్మం చెందారు. ●

---

## మనోబలంలో మిన్న

సీతావియోగానికి తట్టుకోలేక ధైర్యాన్ని కోల్పోయిన రాముడు ఆత్మహత్యకు సంబంధించిన మాటలు మాట్లాడతాడు లక్ష్మణుడితో. అయితే రాముడు తన దగ్గర లేకున్నా. శత్రువు ఇంట ఉన్నా కూడా సీత తన మనోనిబ్బరాన్ని కోల్పోకుండా రావణుడితో ఇలా అంటుంది.

**అసందేశాత్తు రామస్య తపస శ్చామపాలనాత్**
**వ త్వా కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్ధ చేతసా...**

రాముని ఆజ్ఞ లేనికారణంగా నిన్ను బూడిద చేయలేకపోతున్నా అని స్పష్టంగా చెప్తుంది. రావణాసురుడితో నేరుగా మాట్లాడకుండా ఒక గడ్డిపోచను పట్టుకుని దానిని రావణాసురుడిగా భావించి ఈ మాటలు చెప్తుంది. రాముడే తన భార్యను కాపాడుకోగలడు అనే నమ్మకం ఆమెకు సంపూర్ణంగా ఉంది. పురుషుడైన రాముడి కంటే సీత ఎక్కువ మనోధైర్యాన్ని కలిగి ఉంది. రాముడి అంగుళీయకం యొక్క తపశ్శక్తి కారణంగా హనుమంతుడు సునాయాసంగా విఘ్నాలని దాటుకుంటూ నూరు యోజనాల సముద్రాన్ని దాటి సీతమ్మని కనుగొనగలిగాడు. అంగులీకాన్ని సీతమ్మకు తిరిగి ఇచ్చేశాక తిరిగివెళ్లే శక్తి మారుతికి లేదని గ్రహించిన సీత తన చూడామణిని ఇచ్చి తపశ్శక్తి, ఆశీర్వచనాన్ని కూడా ఇచ్చి పంపింది.

రావణవధ అనంతరం సీతమ్మని అలంకరించుకుని రమ్మని కోరాడు రాముడు. లంకలో సంవత్సరం ఉన్న కారణంగా నన్ను మరచిపోయి ఉంటే లంకాధిపతి విభీషణుడిని కాని, సుగ్రీవుని పంచన కాని చేరవచ్చని అంటాడు రాముడు. తన భార్య సౌశీల్యం గురించి పూర్తిగా తెలిసినా కూడా మహారాజు కనుక లోకానికి వెరసి ఆమె పాత్రివ్రత్య నిరూపణకోసం అగ్నిప్రవేశాన్ని కోరతాడు శ్రీరాముడు. ఐనా కూడా రాముని ఒక్కమాట కూడా అనకుండా అగ్నిప్రవేశం చేసి తన పాతివ్రత్యాన్ని నిరూపించుకుంటుంది.

అగ్ని రెండు విధాలు. ఇంధనం చేర్చగా వెలిగే అగ్ని (సేంధనాగ్ని – సఃఇంధనడఅగ్ని) ఒకటి. ఇంధనపు అవసరం ఏ మాత్రమూ లేని అగ్ని (అనింధనాగ్ని – నఃఇంధనఃఅగ్ని) మరొకటి. ఈ రెండింటిలోనూ అనింధనాగ్ని గొప్పది. ఈ అగ్ని ముందు సేంధనాగ్ని తలవంచి తీరుతుంది. సీతమ్మ ముందు అగ్నిహోత్రుడు తలవంచడమంటే ఇదే. అయోనిజ అయిన సీతమ్మ రాముని ఆదేశం మేరకు అగ్నిప్రవేశం చేసినా కూడా ఎవరినీ నిందించక, తన గొప్పదనాన్ని నిరూపించుకుని అగ్నిపునీత అయ్యింది .. లంకాదహన సమయంలో ఎక్కడో ఉన్న హనుమంతుడి తోకని నిప్పు కాల్చకుండా చల్లగా ఉండేలా చేయగల శక్తిగల సీతమ్మ తల్లికి అగ్నిప్రవేశం ఓ లెక్కా? రాముడి మనసు సీతమ్మకు తెలుసు, సీతమ్మ శక్తి గురించి రాముడికి తెలుసు. లోకరక్షణకొరకు ఇద్దరూ సామాన్య మానవుల్లా ప్రవర్తించారు. ఈ రహస్యం తెలియని మూర్ఖులు వితండవాదం చేసి దుమ్మెత్తి పోస్తారు. ఈ సంఘటన ద్వారా సీతమ్మ తనకు తాను గొప్ప కీర్తిని తెచ్చుకున్నా రాముడు మాత్రం అనంతమైన అపకీర్తిని మూటకట్టుకున్నాడు.

సీతమ్మ ఇలా రామునికి మార్గదర్శకురాలు, సహనశీలి , రామునికంటే గొప్ప వ్యక్తిత్వం, శక్తి కలది కావుననే వాల్మీకి తన శ్రీమద్రామాయణానికి "సీతాయశ్చరితం మహత్"(గొప్పదైన సీతమ్మ చరిత్ర) అనే పేరుని పెట్టదలిచాడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ కొరకు మానవులుగా అవతరించిన ఆ శ్రీమన్నారాయణుడు, శ్రీమహాలక్ష్మీ ఇద్దరూ అన్యోన్యమైన, ఆదర్శమైన దాంపత్య జీవనానికి ప్రతిరూపాలు. మంచికి మారుపేరైన శ్రీరామునికి సీతమ్మ ప్రతి అడుగులో తోడూ, నీడా అయింది.

**సర్వం రామమయం..సీతారామమయం..**

మూలం : **డా॥ మైలవరపు శ్రీనివాసరావు**



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



104

## పదునెనిమిదవ అధ్యాయము - మోక్ష సన్న్యాస విభాగయోగము

**47. శ్రేయోన్స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్**
**స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్**

**వ్యాఖ్య :** స్వకీయ కర్మ, లేక తన ధర్మము ఆచరించుట ఒకింత కఠినమైనను, తేలికగా ఆచరింపబడినట్టి ఇతరుల కర్మను గ్రహించుటకంటె అది ఎంతయో మేలని చెప్పబడినది. కావున నిజధర్మమును ఒకింత కష్టమైనను వదలరాదు. స్వకీయ కర్మను పైశ్లోకమందు తెలుపబడిన చందమున ఈశ్వరార్పణ బుద్ధితో చేసినచో మనుజుడు పాపమును బొందకుండును.

(లేక, ఇచట స్వధర్మమనగా ఆత్మకు సంబంధించిన ధర్మమనియు చెప్పవచ్చును. ఆత్మచింతనాదులు ఆత్మధ్యానాదులు ఒకింత ప్రయాసముగా తోచినను, పరధర్మము లైన దృశ్యవస్తుధర్మములను, లేక దృశ్యవస్తుచింతనమును గ్రహించుటకంటె ఎంతయో మేలైనవి. ఆత్మచింతనాదులు (స్వధర్మము) ప్రారంభమున ఒకింత కష్టముగ తోచినను తుదకు అనంత సౌఖ్యమును ప్రసాదించును. దృశ్య వస్తువులు (పరమధర్మము) ప్రారంభమున సుఖవంతములుగ తోచినను తుదకు పరమదుఃఖమునే కలుగ జేయును. కావున పరధర్మము కంటే స్వధర్మమే మేలని చెప్పబడినది.

**48. సహజం కర్మత కౌన్తేయ! సదోషమపి న త్యజేత్**
**సర్వారమ్భా హి దోషేణ ధూమేనాగ్నిరివావృతాః**

**వ్యాఖ్య :** కర్మ యనునది ఇంద్రియాదులచే చేయబడునది గనుక దృశ్యమం దంతర్భూతమైనది. త్రిగుణాత్మకమైనది. ప్రకృతి (మాయ) యందు వర్తించునది. కనుకనే 'దోషేణ' అని చెప్పబడినది. కాబట్టి ఆత్మకాని దోషము, దృశ్యరూపమగు దోషము, త్రిగుణాత్మకమైన దోషము ప్రతికర్మయందును గలదు. అందుచేతనే 'సర్వారమ్భాహి' (సమస్త కర్మలును) అని తెలుపుబడినది. కావున పొగచే అగ్ని కప్పబడి యుండునట్లు సమస్తకర్మలు (దృశ్యరూపములు కనుక) ఈ దృశ్యరూప దోషముచే గప్పబడియున్నవి. అయినను స్వభావసిద్ధములగు కర్మలను వదలరాదు. ఏలయనగా వానిని నిష్కామ బుద్ధితో భగవదర్పిత బుద్ధితో నాచరించినచో అవి చిత్తశుద్ధి ద్వారా జ్ఞానమును, మోక్షమును గలుగజేయగలవు. అయితే పాప కార్యములను మాత్రము చేయరాదు. సమస్తకర్మములును 'మాయా' రూప దోషముచే నాచరింపబడియున్నప్పటికిని అందు శుద్ధకర్మయే అశుద్ధకర్మను, పుణ్యకర్మచే పాపకర్మను, నిష్కామకర్మచే సకామ కర్మను తొలగించివేసి, ఆ పిదప క్రమక్రముగా సాధనాతిశయముచే ఇంకను పైకిపోయి నైష్కర్మ్యాత్మరూపమున చేరవలయును.

ఈ విషయమును మఱియొక దృష్టితో గూడ విచారించవచ్చును. వారువారు చేయు కొన్ని కార్యములందుపంచసూనాది అనివార్యదోషము లేర్పడుచుండును. జీవితయాత్రకై ఆయా కార్యములను జనులు తప్పక చేయవలసి యున్నారు. కావున ఆయా దోషముల నివారణకై పంచ విధ ప్రాయశ్చిత్తము లేర్పడినవి.

| దోషము (పంచ సూనములు) | ప్రాయశ్చిత్తము (పంచ మహాయజ్ఞములు) |
|---|---|
| 1. ధాన్యమును ఉత్పత్తి చేయునపుడు సంభవించు ప్రాణి హింస | 1. బ్రహ్మ యజ్ఞము– వేదాధ్యయ నాదులను జేయుట |
| 2. విసరునపుడు | 2. పితృ యజ్ఞము– పితృదేవతలను తర్పణాదులచే తృప్తిపరచుట |
| 3. కట్టెలు నరుకునప్పుడు వానిచే వంట వండునప్పుడు | 3. దేవ యజ్ఞము – హోమము మున్నగునవి చేయుట |
| 4. జలము తెచ్చునపుడు, కాచునపుడు | 4. భూతయజ్ఞము– ప్రాణులకు అన్నదానాదుల నొసంగుట |
| 5. ఊడ్చునపుడు | 5. మనుష్య యజ్ఞము– అతిథులను, బ్రహ్మనిష్ఠులను దీనులను భోజనాదులచే తృప్తి పరచుట |

ఈ ప్రకారముగ కర్మలవలన గలుగు ఆయా అనివార్య దోషములు పుణ్యకార్యము లచే, నిష్కామ కార్యములచే తొలగిపోగలవు. ఇంతియే కాక బ్రహ్మ విచారణ, ఆత్మ ధ్యానము మున్నగు మహోన్నత పవిత్ర కార్యములచే జీవులందరి ప్రకృతి దోషములు లెస్సగ తుడిచిపెట్టుకొని పోగలవు. కావున వారి వారి స్వభావసిద్ధ కార్యమునందు ప్రకృతి జన్యములను దోషములున్నప్పటికిని వానిని త్యజించక, నిష్కామ బుద్ధితో వానినాచరించుచుండినచో క్రమముగ హృదయము నిర్మలమై జీవునకు జ్ఞాన ప్రాప్తి ఉత్తమ బ్రహ్మ పద ప్రాప్తి సిద్ధించగలవు.

**49. అసక్తిబుద్ధిస్సర్వత్ర జితాత్మావిగతస్పృహః**
**నైష్కర్మ్యసిద్ధిం పరమాం సన్న్యాసేనాధిగచ్ఛతి**

**వ్యాఖ్య :** ఇంతవఱకు నిష్కామకర్మయోగమును ప్రతిపాదించుచువచ్చి ఇటనుండి జ్ఞానయోగ (సాంఖ్యయోగ) విచారణయందు ప్రవేశించుచున్నారు. కొన్ని సుగుణ ములు చెప్పి, అవి కలవాడు నిష్క్రియపరమాత్మ స్థితిని బొందగల్గునని వచించు చున్నారు. అవి యేవియనగా (1) దేనియందును తగుల్కొనని బుద్ధిగలిగియుండుట (2) మనస్సును జయించుట (3) ఆశ లేకుండుట.

'సర్వత్ర' – అని చెప్పుటచే ఏ వస్తువునందును, ఏ కాలమందును బుద్ధి తగుల్కొనరాదనియు, సర్వత్ర ఆసక్తుడై మెలగవలెననియు భావము. ఏలయనగా కొందఱు కొన్ని విషయములందు విరక్తులైయున్నను, కొన్నిటియందు ఆసక్తులై యుందురు. అట్లే కొందఱు ధ్యానకాలమందు ఆసక్తచిత్తులైయున్నను, బహిఃప్రపంచ ములో ప్రవేశించు నప్పుడు విషయములందు సక్తత గలిగియుందురు. అట్టిదేమియు లేకుండుటకుగాను, 'సర్వత్ర' అని ఉపదేశింపబడినది.

'జితాత్మా' – తన మనస్సును జయించినవాడు ప్రపంచమునంతను జయించి నట్లే. అట్లు మనస్సును జయించనివాడు ప్రపంచమునంతను జయించినను పర తంత్రుడేయగును. దుఃఖ మాతనిని వీడదు. కాబట్టి బయటి శత్రువులతోబాటు అంతః శత్రువులనుగూడ జయించవలెను. లేనిచో 'భోక్తుర్గళే కణ్టకవత్ప్రతీతమ్' – అని శ్రీ శంకరులు చెప్పినట్లు, దుష్టమనస్సు 'భుజించువాని కంఠమున తగుల్కొనిన ముల్లువలె' బాధించును. కాబట్టి వివేకవంతులు ముమ్ముందు తన మనస్సును, ఇంద్రియములను ప్రయత్నపూర్వకముగ జయించవలెను.

'విగతస్పృహః' – దృశ్యపదార్థముల వేనియందును కోరిక, ఆశ యుండరాదు. అప్పుడు మనస్సు బయటకు పరుగెత్తక అంతర్ముఖమై ఆత్మయందు నెలకొనును చంచల చిత్తముచే ఆత్మానుభూతి యెన్నటికిని కలుగదు. చిత్తము నిశ్చలముగా నుండలెనని కోరికలు నశించవలెను. కనుకనే 'విగతస్పృహః' (ఆశ, కోరికలు లేకుండవలెను) అని చెప్పబడినది.

'నైష్కర్మ్యసిద్ధిమ్' – మోక్షము నిచట నైష్కర్మ్యస్థితియని వర్ణించిరి. అనగా సమస్త కర్మలు రహితమైన ఆత్మస్థితియని అర్థము. దేహము ఇంద్రియములు, మనస్సు అన్నిటిని దాటిన స్థితి గనుక అట్టి ఆత్మస్థితియందు కర్మ సంభవింప అద్దానిని నైష్కర్మ్యమని చెప్పిరి. అట్టి నైష్కర్మ్యరూపమగు ఆత్మస్థితి త్యాగము (సన్న్యాసము) చేతనే లభించునని ఇట తెలుపబడినది. దేని త్యాగము? కర్మఫలత్యాగము, విషయవాంఛా త్యాగము, సంగపరిత్యాగము. దీనినిబట్టి కర్మఫలత్యాగముచే, విషయాశాపరిత్యాగముచే క్రమముగ కర్మరహిత (నైష్కర్మ్య లేక కర్మాతీత) మోక్షపదవి లభించగలదని స్పష్టమగుచున్నది.

'పరమామ్' – అని చెప్పుటచే ఆ యాత్మస్థితి అన్ని పదవులకంటెను, అన్ని సిద్ధులకంటెను శ్రేష్ఠతమమైనదని విదితమగుచున్నది.

*(తరువాయి వచ్చే సంచికలో)*

# మండలి బుద్ధప్రసాద్ షష్ట్యబ్ది పూర్తి జరిగిందంటే నమ్మలేకపోయాను!



బుద్ధిమంతుడని ఆయన బుగ్గలనిగ్గు చెబుతున్నాయ్. మా నాన్నా, నేనూ ఒకటేనన్నట్లు ముఖరేఖలు చెబుతున్నాయ్.

తండ్రి మండలి వెంకటకృష్ణారావులోని భాషాచాతుర్యం, భాషాభిమానం మృగ్యం కాలేదని ఆయన వాక్చాతుర్యం చెబుతుంది. తండ్రి రూపురేఖా విలాసాల్లో తేడా లేదని ముఖపోలికలు చెబుతాయ్. ఒక్కొక్కసారి ఆయన మాటతీరు, స్వచ్ఛతనం, సత్శీలం, క్రమ శిక్షణ చూస్తూంటే – మండలి వేంకట కృష్ణా రావు మళ్ళీ తిరిగొచ్చాడా అనే సంతోషం కలుగుతుంది.



అవనిగడ్డలోని గాంధీక్షేత్రం అలాగే ఉం దంటారు. కార్యక్రమాలు అలాగే కొనసాగు తున్నవంటున్నారు. తెలుగు సాహితీ మూర్తుల్ని అలాగే గాంధీక్షేత్రం పిలిపించి గౌరవిస్తున్నారు. పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయంలో మండలి వేంకట కృష్ణారావు ప్రాంగణం ఉన్నది. ఎన్నో తెలుగు సాహితీ కార్యక్రమాలను అక్కడ క్షేత్రస్థాయిలో నిర్వ హిస్తున్నారు.

తండ్రిలా యిచ్చిన మాట తప్పరు. ఇచ్చ గింపు మాటలు మాటాడరు. మాట యిచ్చారా – యిచ్చిన మాటకు తిరుగు ఉండదు. మనిషిలోని ఔన్నత్యాన్ని గుర్తిస్తూ సమయ సందర్భాలు వచ్చినప్పుడు మాట చెల్లుబాటు చేసుకుంటారు.

రాజకీయాల్లో ఆయన ఉంటున్నప్పటికినీ రాజకీయ వాసనలేవీ ఆయన్ను అంటలేదు. అహరహమూ సాహిత్యం, వాటి సాన్నిహిత్యాన్నే ఆయన కోరుకుంటుంటారు. సాహితీ సారస్వాన్నే ఆఘ్రాణిస్తూంటారు; ఆస్వాదిస్తూంటారు.

గత సం॥ము మే 27 శుక్రవారం సాయం సమయాన సాయం సూర్యుడు హస్తగిరికి చేరకుండా ఆకాశం సింధూరపు రంగును పూసుకుంటున్న లేత సన్నని సంధ్యా రుణ సమయంలో రవీంద్ర భారతిలో మండలి బుద్ధ రవీంద్రుని షష్ట్యబ్ది మహోత్సవాన్ని ఘనంగా జరుపుతూ, బుద్ధయానం గ్రంథావిష్కరణం కార్యక్రమం సంవత్సరానంతరం నా మెదడులో మెది లింది. అప్పుడు అస్వస్థునిగా విజయా ఆసుపత్రి వారి రోగుల ఖాతాలో ఉండి పోయాను. తిరిగి వస్తానన్న నమ్మకమూ లేదు. ఆ సంచికకు వ్యాసమూ వ్రాయలేదు, వ్రాయలేని పరిస్థితి – యని సంజాయిషీ చెప్పలేదు.

ఎందుకో ఇప్పుడు సంవత్సరం తరవాత ఆ బాధ పునర్భవించింది. ఆతరువాత మేమిరువురమూ కలుసుకున్న సందర్భం వచ్చినా, ఆ విషయాన్ని మనసు చెప్పరా చెప్పరా – యని పోరు పెట్టింది. ప్రస్తావించ లేదు. బండి ఫ్లాటుఫారం నుంచీ వెళ్ళిన తరువాత ఏ జెండా చూపినా ఆ ఎజెండా ఒప్పుకోదు, కానీ నా మనసు చెప్పరా అంది! కాబట్టి మనసు మనసార చెప్పమంది కావున చెబుతున్నాను; దీర్ఘాయుష్మాన్భవా! అంటూ దీవిస్తున్నాను. ●



# గలగలా గోదావరి కదులాడినట్లు కృష్ణమ్మలా ప్రవహించింది

## -ఎక్కడ క్షీరపురి! ఎక్కడి చెన్నపురి!-

**ఎనిమిది రూపాయల చెన్నయ్ రైలు టిక్కట్టు కొని వందరూపాయల జేబుతో దిగాను.**

**అష్టోత్తరంలా 108 రూపాయల పెట్టుబడి.**

ఉన్న ఊరు కాదన్నావు! ఊరు విడిచి పోతున్నావు! ఏ ఘనకార్యం సాధిస్తావో! ఏమౌతావో ఎవరికెరుకరా! పోరా! బాబూ! పోరా అన్నది నిడదవోలు రైలు ప్లాట్‌ఫారమ్. ఆ పట్టాలపై వెళ్లేది మద్రాసు మెయిలే. ఆ రెండు రైలు పట్టాలమీదనే వెడుతూంది. నేను పాలకొల్లు రైల్వేస్టేషన్‌లోని ఒక రైలుపట్టాపై కాలునిలిపాను. చెన్నయ్ సెంట్రల్ స్టేషన్‌లోని ఓ రైలు పట్టాపై రెండో కాలు ఆన్చి నిల్చున్నాను. చేస్తూన్న ప్రాథమిక పాఠశాలోపాధ్యాయ పదవికి రాజీనామా చేయలేదు, చెన్నపట్నంలో వేసే అడుగు ఎలా నిలుస్తుందో తెలియదు.

63 సంవత్సరాల వెనకకు దృష్టి నిగిడ్చి చూచుకుంటున్నప్పుడు వెనుక దృశ్యం (ఫ్లాష్‌బ్యాక్) దృష్టమైంది. ఏ ధైర్యంతో వచ్చాను. ఏ ఉద్యోగం ఉందని వచ్చాను. అనే ఆలోచనమే.

తలవొంచుకుని నను చూడు! తలయెత్తుకునేలా చేస్తాను అన్నది మనం ప్రతీ కార్యానికీ ముందు తల ఎత్తుకుని దించుకునే పరిస్థితి వస్తే జాతక ప్రభావం అనుకుంటాను. తలయెత్తుకునే పరిస్థితి కలిగితే పెద్ద ఆశీర్వచనం అనుకుంటాను– అనే దృఢ చిత్తంతో కాలునాను. ఏ అర్హత కలదని వచ్చాను. మనసు మాత్రం బిరుసుగా ఉంది. శిరోజాలు నల్లని త్రాచుల వలె పడగలెత్తి ఆడుతున్నాయ్.

చదువు సర్టిఫికేట్లను చేతబట్టుకుని రాలేదు. అవీ ఏ డిగ్రీ (పట్టా)కూ చెందిన ప్రమాణ పత్రాలు కావు. కాబట్టి పాలకొల్లులోనే ఉంచి వచ్చాను.

ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారి ప్రజాపత్రికలో పనిచేసాను. ఆ పత్రిక ఎంతో కాలం నిలువలేదు. అక్కడికి పది, పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వావిళ్లవారి త్రిలిఙ్గ పత్రికలో సహ సంపాదకునిగా చేరాను. రోజుకు ఒక గంటే పని కాబట్టి నెలకు 30 రూపాయలు ఇస్తామన్నారు.మధ్యలో డా॥డి. అప్పారావుగారి సూర్యప్రభ, పాపాయి పత్రికల్లో పనిచేశాను. ఇంతలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌వారు ఇండియన్ లాంగ్వేజ్ స్క్వేర్ వర్డ్సు పెడుతూన్నట్లు ప్రకటన వచ్చింది. నెలకు 75 రూపాయల జీతం. ఆ గుమస్తా ఉద్యోగం కోసం గ్రాడ్యుయేట్స్ (బి.ఏ., ఎంఏల వాళ్ళు) ఇంటర్వ్యూకు వచ్చారు. నాకు ఉద్యోగం వస్తుందనే నమ్మకం లేదు. డిగ్రీ సర్టిఫికేట్టు ఏమైన ఉందా? అనే అడిగారు. ఇంటర్వ్యూ చేసిన చార్లెస్ జోసెఫ్ మాటల చమత్కారి, నేనది గ్రహించాను. ఒళ్లు వేడిగా ఉంది. వొణుకు పుట్టింది. ఎన్ని డిగ్రీల జ్వరమో తెలియదన్నారు. నన్ను ఇంటర్వ్యూ చేసిన వెంటనే ఆయన కాబిన్ (ఆఫీసు గది)లోకి వెళ్లారు. లోపల్నుంచీ రమ్మని కబురు పంపారు. కొడతారని భయపడ్డాను. **యూఆర్ అప్పాయింటెండ్** అంటూ కాగితం యిచ్చారు. 75 రూపాయల జీతం ప్రతీ రోజూ ఓవర్‌టైము ఉండవచ్చు దానికి ప్రత్యేకమైన జీతం ఉంటుందన్నారు. అలా ఓ స్టాండర్స్ ఉద్యోగం వచ్చింది. సత్రం భోజనం మఠం నిద్రా అన్నట్లు మిడ్‌లాండ్ థియేటర్‌కు ఎదురుగా ఉన్న మిడ్‌లాండ్ కేఫ్‌లో భోజనం. ఆ అయ్యర్‌గారికి నాపై 'ప్రేమ'కలిగింది. ఆ వంటలు తినలేకపోతున్నానని బయటి నుంచీ ఆవకాయ, పచ్చళ్లు తెప్పించడమే గాకుండా ఓకప్పు పెరుగు అదనంగా యిచ్చేవారు. అక్కడ సమీపంలోని ఉడ్‌లాండ్ గడియార స్తంభం దగ్గర కృష్ణాకేఫ్‌లో పైన ఒక హాలును సిమెంట్ షీట్లను గోడలుగా పెట్టి, చిన్న చిన్న గదులను నెలవారీ అద్దెకు యిచ్చేవారు. నేనూ స్క్వేర్‌వర్డ్సులో పనిచేస్తున్న చెట్టియార్ కలిసి ఒకే గదిలో ఉండేవాళ్లం. అతనికి ఇంగ్లీషు రాదు, తెలుగు అసలే తెలియదు. మేమిద్దరమూ ఒకే గదిలో ఉండేవారం.

నాకున్న పత్రికా వ్యాసంగం పోలేదు. ఆంధ్రప్రభ, ఆంధ్ర పత్రికలలో వ్యాసాలు వ్రాస్తూంటే రూ. 10లు చొ॥న పారితోషికం పంపేవారు. సాహితీ మిత్రులు వస్తుండేవారు. గుడిమెట్ల హరికృష్ణగారి భార్య, ప్రసిద్ధ రచయిత్రి తెన్నేటి హేమలతా దేవి వస్తూండేవారు. ఆంధ్ర మహిళా మాస పత్రికలో సాంఘిక సంక్షేమం అనుబంధం వ్రాసేవాణ్ణి. ఆ శీర్షికకో 25 రూపాయలు యిచ్చేవారు. అలా కస్తూరి రంగనాయకమ్మ వంటి మహిళా నాయకమణులు పరిచయమయ్యారు. రాజనాల పరిచయ మయ్యాడు. వారింటిలో ఓ సభ్యుణ్ణిగా చెలామణీఅయ్యాను. నాకు పెళ్లయిన తరువాత నాకు గది దొరికేవరకూ నా భార్యకూడా నాతోనే ఉండేది.

**1956**లో సత్యవతితో వివాహం జరిగిన తరువాత, నా జీవితమే మారి పోయింది. పెండ్యాల నాగేశ్వరరావుగారి ఔట్‌హౌస్‌లో కాపురం పెట్టాం. పొన్నలూరి బ్రదర్స్‌వారు పిలిచి – సినీ రమ మాసపత్రికను ప్రారంభిస్తూ, నన్నే సంపాదకునిగా చేసారు. అప్పటి వరకూ ఉన్న తెలుగు సినిమా పత్రికల్ను అధిగమించేట్లు చేయడంతో నాజీవిత విధానంలో మార్పు వచ్చింది. ఎప్పుడూ ఎవరో అతిథులు వస్తూండేవారు. ఎవరో ఒకరు ఇంట్లో తిష్ట వేస్తూండేవారు. మా పెద్దబ్బాయ్ వేంకటేశ్వరరావు పుట్టడంతో ఓ మార్పు వచ్చింది. మా రెండవ అబ్బాయి నారాయణరావు పుట్టడంతో సిటీ ఇంప్రూవ్ ట్రస్టులో గృహవాస స్థలం దొరికింది. ఇల్లుకట్టిన రెండు సంవత్సరాల తరువాత మా 3వ అబ్బాయి నాగ సాయి ప్రసాద్ స్వంత ఇంట్లోనే పుట్టాడు. ఎప్పుడూ ఏ సంతానం కోసం నా శ్రీమతి ప్రసూతి నిలయాలకు వెళ్లలేదు. నాగమణి తల్లి మాణిక్యమ్మగారు మా యింటికి వస్తూండేవారు. ఆవిడ యెప్పుడూ నా సతీమణికి తోడుండేవారు.

ప్రఖ్యాత సినిమా నటులే యింటికి వస్తూండేవారు. ముఖ్యంగా నేనేవీ పెద్ద ఉపకారం చేయకపోయినా శోభన్‌బాబు తరచూ నా యింటికి వస్తూండేవారు. ముఖ్యంగా ఎన్టీ రామారావు, ఆయన సోదరుడు త్రివిక్రమరావు, 'మధురవాణి' పత్రిక పునరుద్ధరణకెంతో సహకరించారు. వారి చిత్రం 'పాండురంగ మహత్యం' చిత్రం సందర్భంలో ప్రత్యేక సంచికను ప్రచురింపచేశారు. అలా మధురవాణి పత్రిక మొగ్గతొడిగింది. వారికి కృతజ్ఞతను తెలియచేసాను.

**(సశేషం)**